క్లుప్తంగా

సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థుల ప్రతిభ



సైన్స్ ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈఓ అనితా రోజీరాణి

చీమకుర్తి: సంతనూతలపాడు మండల స్థాయిలో అన్ని జిల్లా పరిషత్ హైస్కూళ్లకు చెందిన విద్యార్థులు సైన్స్ ఎగ్జిబిషన్‌లో నైపుణ్యాలు ప్రదర్శించారు. సోమవారం సంతనూతలపాడులోని జిల్లా పరిషత్ హైస్కూల్లో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని డిప్యూటీ డీఈఓ అనితా రోజ్ రాణి సందర్శించి సైన్స్ ప్రాజెక్టులను పరిశీలించారు. జెడ్పీటీసీ సభ్యురాలు దుంపా రమణమ్మ సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. వ్యక్తిగతంగా, గ్రూపులో ఎంపికైన విద్యార్థుల ప్రదర్శనలను జిల్లాలో జరగనున్న సైన్స్ ఎగ్జిబిషన్‌కు పంపనున్నట్లు మండల ఎంఈఓలు తెలిపారు. వ్యక్తిగతంగా ఎంపికైన వారిలో టీ మధుకిరణ్ నాయుడు (సంతనూతలపాడు జెడ్పీహెచ్ఎస్), డీ.సాత్విక్ (మంగమూరు జెడ్పీహెచ్ఎస్), సీహెచ్ వైష్ణవి (కొనగానివారిపాలెం జెడ్పీహెచ్ఎస్) వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచినట్లు తెలిపారు. గ్రూపుల వారీగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో సంతనూతలపాడు, మంగమూరు, సంతనూతలపాడు జిల్లాపరిషత్ హైస్కూళ్ల నుంచి ప్రదర్శించిన ప్రాజెక్టులు ఎంపికైనట్లు వెల్లడించారు. ఎంపికైన వారికి డిప్యూటీ డీఈఓ, జెడ్పీటీసీ చేతుల మీదుగా ప్రశంసపత్రాలు, మెమెంటోలు బహూకరించారు. కార్యక్రమంలో సంతనూతలపాడు ఎంఈఓలు చంద్రమౌళేశ్వరరావు, వెంకారెడ్డి, ఆయా హైస్కూళ్ల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ సాబ్జికి ఘన నివాళులు



సాబ్జి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న యూటీఎఫ్, సీఐటీయూ నాయకులు

చీమకుర్తి: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి చిత్రపటానికి యూటీఎఫ్ నాయకులతో పాటు సీఐటీయూ నాయకులు సోమవారం ఘనంగా నివాళులర్పించారు. చీమకుర్తిలోని యూటీఎఫ్ భవన్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఉపాధ్యాయులకు ఆయన అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు.

నిరాశ్రయులకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న హసన్ ఫాతిమా ట్రస్ట్ సభ్యులు

ఒంగోలు టౌన్: నగరంలోని నిరాశ్రయులకు హసన్ ఫాతిమా ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం దుప్పట్లు పంపిణీ చేశారు. నగరంలోని కేశవస్వామిపేటలో గల శ్రీప్రసన్న చెన్నకేశవస్వామి దేవాలయం, వీరాంజనేయస్వామి దేవాలయం, లాయరుపేట సాయిబాబా మందిరం వద్ద ఉన్న నిరాశ్రయులకు ట్రస్ట్ చైర్మన్ షేక్ మహబూబ్ జాన్ దుప్పట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రసన్న చెన్నకేశవస్వామి దేవస్థానం చైర్మన్ ఈదుపల్లి గురునాథరావు, ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరు శ్రీనివాసులు, ఎర్రన సాహిత్య పరిషత్ అధ్యక్షుడు మైనంపాటి సాయికుమార్, ట్రస్ట్ కార్యదర్శి హుమయూన్ పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష-2ను విజయవంతం చేయాలి



మద్దిపాడులో సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, అధికారులు, నాయకులు



ఒంగోలులో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎంపీపీ మల్లికార్జునరెడ్డి, ఎంపీడీవో అజిత

- మద్దిపాడు ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి

మద్దిపాడు: జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్-2ను విజయవంతం చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని మద్దిపాడు ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి సూచించారు. సోమవారం ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షను మండలంలో ప్రజలు చక్కగా వినియోగించుకున్నారని, సెకండ్ ఫేజ్‌ను కూడా ఎక్కువ మంది వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. గతంలో ఐదు లక్షల రూపాయలు ఇస్తుండగా, ప్రస్తుతం 25 లక్షల రూపాయల వరకూ కార్పొరేట్ ఆస్పత్రుల్లో చూయించుకోవడానికి ఈ కార్డులు ఉపయోగపడతాయని వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఆరోగ్యం కోసం ఆలోచించి ఏపీని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఆయనకు బాసటగా నిలిచి ఆయన ఆశయాల సాధనకు ప్రతిఒక్కరం పాటుపడదామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఏఓ సుబ్బారావు, ఎంఈఓ ఎంవీఆర్ ఆంజనేయులు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మండవ అప్పారావు, నాయకులు మజీద్, గుర్రపాతల రవి, రాయపాటి రమేష్, వైద్యశాఖ సిబ్బంది, పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ఒంగోలు రూరల్: రాష్ట్రంలో రూ.5 లక్షల్లోపు వార్షిక ఆదాయం కలిగిన ప్రతిఒక్కరూ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ఉచిత సేవలకు అర్హులని, సద్వినియోగం చేసుకోవాలని ఒంగోలు ఎంపీపీ పల్లపోలు మల్లికార్జునరెడ్డి అన్నారు. జనవరి 2 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష వారోత్సవాల సందర్భంగా సోమవారం ఉదయం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.



కొత్తపట్నంలో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులు పంపిణీ చేస్తున్న రవీంద్రరెడ్డి, సుజాత

ఆరోగ్యశ్రీ సేవలను 104 కాల్ సెంటర్ ద్వారా, విలేజ్ క్లినిక్ ద్వారా, 108 అంబులెన్స్ ద్వారా, ఫ్యామిలీ డాక్టర్ ద్వారా నిర్ధారించబడిన అనారోగ్యానికి కార్పొరేట్ స్థాయిలో ఉచిత వైద్యం, ఉచిత మందులు, ఉచిత సేవలు పొందవచ్చని వివరించారు. ఎంపీడీవో పి.అజిత మాట్లాడుతూ ఎవరైనా వారి ఆరోగ్య సమస్యను 104కు కాల్ చేసి వివరిస్తే ఆరోగ్యశ్రీ ఆస్పత్రి వివరాలు తెలియజేస్తారన్నారు. నేడు ప్రభుత్వం ప్రతి గ్రామంలో విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, అర్బన్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేస్తోందని తెలిపారు. ప్రజలు ఆరోగ్య సమస్యలను క్లినిక్‌లోని ఏఎన్ఎంకు, సీహెచ్‌వోకు తెలియజేస్తే ఆరోగ్యమిత్ర వెంటనే వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా అడ్మిట్ చేసి ఆరోగ్య సేవలు అందిస్తారన్నారు. అకస్మాత్తుగా అనారోగ్యం కలిగిన పక్షంలో 108 వాహనానికి సమాచారం అందించిన పక్షంలో పేషెంట్‌ను ఆస్పత్రికి తీసుకెళ్లి అక్కడ ఆరోగ్యశ్రీ ఉన్న పక్షంలో ఉచిత సేవలు అందిస్తారన్నారు. అనంతరం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పోస్టర్‌ను ఎంపీపీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీవోతో పాటు ఈవోఆర్డీ మారెడ్డి రమణమ్మ, ఏవో శ్రీనివాసరెడ్డి, మెడికల్ ఆఫీసర్ సుందర్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు

కొత్తపట్నం: ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన తర్వాత వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి ఎంతో మంది పేద, బడుగు, బలహీనవర్గాల వారికి ఆరోగ్య పరంగా అండగా నిలిచారని జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం లాంచ్ చేసిన మెగా ఆరోగ్య శ్రీ, అవగాహన సదస్సు ప్రత్యక్ష ప్రసారంలో కొత్తపట్నంలో ఆయన పాల్గొన్నారు. ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత, డాక్టర్లు వైష్ణవి, శివపార్వతి, ఈవోఆర్డీ ఏ బాలచెన్నయ్య హాజరైన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి సందేశాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా రవీంద్రరెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా పేద కుటుంబాలకు పునర్జన్మ ప్రసాదిస్తున్నారని కొనియాడారు. ఈ పథకం ద్వారా ఉచిత వైద్యం పరిమితిని రూ.5 లక్షల నుంచి ఏకంగా రూ.25 లక్షలకు పెంచడం గొప్ప విషయమన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రభుత్వ వైద్యశాలలో కార్పొరేట్ వైద్యం అందించటంతో పాటు ప్రైవేటు ఆస్పత్రిలో అధునాతన వైద్యం పొందేలా ఆరోగ్య శ్రీ పెట్టడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. క్యాన్సర్, గుండె, లివర్ వంటి పెద్ద జబ్బులకు రూ.25 లక్షలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత మాట్లాడుతూ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ ద్వారా రూ.5 లక్షల వార్షిక ఆదాయం ఉన్న ప్రతి ఒక్కరికీ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ వర్తిస్తుందన్నారు. తద్వారా వైద్యం కోసం పేద ప్రజలు అప్పుల పాలవకుండా కాపాడుతుందన్నారు. గ్రామ సచివాలయ సిబ్బంది ఇంటింటికి తిరిగి ఈకేవైసీ చేసి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేయాలని ఆదేశించారు. మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ శివపార్వతి, వైష్ణవి మాట్లాడుతూ ఆరోగ్య శ్రీలో 3,257 చికిత్సలకు వైద్యం అందించడం జరుగుతోందన్నారు. ఇతర రాష్ట్రాలైన చెన్నై, బెంగళూరు, హైదరాబాద్‌లోనూ ఆరోగ్యశ్రీ ద్వారా 204 హాస్పిటళ్లలో వైద్యం అందిస్తారని చెప్పారు. అనంతరం స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో ఓంకార్, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

శిద్దా ఇంట అయ్యప్పస్వామి అఖండ పడి పూజ

- పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యే కరణం, పలువురు ప్రముఖులు



పడి పూజ నిర్వహిస్తున్న శిద్దా రాఘవరావు దంపతులు, శిద్దా సుధీర్‌కుమార్ దంపతులు

ఒంగోలు మెట్రో: వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు నివాసంలో సోమవారం రాత్రి అయ్యప్పస్వామి, దుర్గాదేవి అమ్మవారి అఖండ పడి భజన వేడుకను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అరటి బోదెలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన మండపంలో కొలువుదీరిన గణపతి, అయ్యప్పస్వామి, దుర్గామాత, శివ పరమాత్మ, వెంకటేశ్వరస్వామి, లక్ష్మీఅమ్మవారు, సుబ్రహ్మణ్య స్వామి దేవతామూర్తులకు శిద్దా రాఘవరావు దంపతులు, టీటీడీ పాలక మండలి సభ్యుడు శిద్దా సుధీర్‌కుమార్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా శిద్దా సుధీర్‌కుమార్ చీమకుర్తి హరిహరక్షేత్రం నుంచి శాస్త్రోక్తంగా భక్తిశ్రద్ధలతో మంగళ వాయిద్యాలు, వేదమంత్రాల నడుమ అయ్యప్పస్వామి మూలవిరాట్టును ఒంగోలు పడి పూజ మండపానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. శిద్దా రాఘవరావు దంపతులు, వేద పండితులు నేలబొట్ల రామకృష్ణశాస్త్రి, గోపాల్ గురుస్వామి కలిసి స్వామివారికి, మండపంలో కొలువుదీరిన సకల దేవతలకు విశేష పూజలు నిర్వహించారు. గణపతి పూజ, సహస్రనామార్చన, కుంకుమార్చనలు, అభిషేకాలు, 18 మెట్లకు అఖండ మహా హారతితో పడి పూజను వైభవంగా నిర్వహించారు. శాంభవి భక్త సమాజం ఒంగోలు వారు అయ్యప్పస్వామి, దుర్గాదేవి భక్తి పాటలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. దేవతామూర్తుల వేషధారణ అందరినీ ఆకట్టుకుంది.

విశేష అలంకరణలు, విద్యుత్ దీపకాంతులతో అయ్యప్పస్వామి పడి భజన అత్యంత భక్తిశ్రద్ధలతో సాగింది. మహా పడి భజన అనంతరం సర్వ దీక్షా స్వాములకు, భక్తులకు తీర్థప్రసాదాలు, భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో శిద్దా రాఘవరావు కుటుంబ సభ్యులతో పాటు కలెక్టర్ దినేష్ కుమార్, చీరాల ఎమ్మెల్యే కరణం బలరాం, జ్యోతి గ్రానైట్ సీఓఓ ఎం.శివరామ్, సరస్వతి విద్యా సంస్థల చైర్మన్ రమణారెడ్డి, పోతుల సురేష్, ఒంగోలు నగర వర్తక, వాణిజ్య అసోసియేషన్ ప్రతినిధులు, గ్రానైట్ వ్యాపార రంగాల ప్రముఖులు, లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్, జేసీస్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు, డీటీసీ సుశీల, ఏపీఎస్‌పీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ కె.వి.సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు, శ్రేయోభిలాషులు, ఉమ్మడి ప్రకాశం జిల్లాకు చెందిన ఆర్యవైశ్య సంఘ నాయకులు పాల్గొన్నారు.

దివ్య ధార్మిక గ్రంథం.. తిరుప్పావై



తిరుప్పావై ప్రవచనంలో పాల్గొన్న భక్తులు

ఒంగోలు మెట్రో: స్థానిక సంతపేట సాయిబాబా మందిర ప్రాంగణంలో ఉపాలయంగా ఉన్న వెంకటేశ్వరస్వామి మందిరంలో తిరుప్పావై మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ప్రతిరోజూ ఉదయాన్నే మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై పారాయణం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా తిరుమల తిరుపతి దేవస్థానం ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు సారథ్యంలో ప్రవచకుడు నెమ్మాని సీతారామమూర్తి తిరుప్పావైలోని విషయాల్ని విపులంగా విశదీకరిస్తున్నారు. సోమవారం రెండో పాశురాన్ని వివరిస్తూ గోదాదేవి అమ్మవారు చెప్పిన వ్రత నియమాల విధానాన్ని భక్తులకు తెలియజేశారు. పెద్దల మాటలనే ఆచరిస్తాము, పరుషంగా మాట్లాడము, భోగ్యమైన పదార్థాలను స్వీకరించము అంటూ ఆండాళ్ తల్లి ప్రకటించిన సూక్తులను తెలిపారు. మధుర భక్తికి ప్రతీకగా తిరుప్పావైని వర్ణించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అళహరి చెంచలరావు, సాయి మహిళా భక్తమండలి ప్రతినిధి దామచర్ల కుమారి, అర్చకుడు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీని కలిసిన మార్కాపురం సీఐ



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఐ

ఒంగోలు టౌన్: ఇటీవల మార్కాపురం సీఐగా నియమితులై బాధ్యతలు చేపట్టిన ఏ వెంకటేశ్వర్లు సోమవారం ఎస్పీ మలికాగర్గ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఒంగోలులోని జిల్లా పోలీసు కార్యాలయానికి చేరుకుని ఎస్పీని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.



ఇరుముడులతో అయ్యప్పస్వామి దర్శనానికి వెళ్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే శివప్రసాదరెడ్డి

అయ్యప్పస్వామి దర్శనానికి తరలిన బూచేపల్లి

చీమకుర్తి: అయ్యప్పస్వామి మాల ధరించిన జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, వారి కుటుంబ సభ్యులు ఇరుముడులు ధరించి అయ్యప్పస్వామి దర్శనానికి వెళ్లారు. ఆదివారం రాత్రి అయ్యప్పస్వామి పడి భజన అనంతరం సోమవారం ఉదయం గురుస్వామి వద్ద ఇరుముడులు కట్టించుకుని పూజలు చేసి అయ్యప్పస్వామి దర్శనం నిమిత్తం తరలివెళ్లారు.

విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ



క్రీడా దుస్తులు అందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుడు వినయ్‌కుమార్

ఒంగోలు రూరల్: ముక్తినూతలపాడు జెడ్పీ హైస్కూలు విద్యార్థులకు ప్రముఖ పారిశ్రామికవేత్త, వైఎస్సార్ సీపీ నాయకుడు రాయపాటి వినయ్‌కుమార్ సోమవారం క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. హైస్కూలు హెచ్‌ఎం దేవసేన అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో హైస్కూలులోని క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో బాలబాలికల జట్లకు క్రీడాదుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ పాఠశాలలో పనిచేసే గురువులు మంచి విజ్ఞానాన్ని అందిస్తారని, విజ్ఞానంతో పాటు క్రీడా ఆసక్తి కలిగి ఉండటం ముఖ్యమని అన్నారు. క్రీడలతో మానసికంగా, శారీరకంగా దృఢంగా ఉండేందుకు దోహదం చేస్తాయన్నారు. ఈ నెలలో జరగనున్న ఆడుదాం ఆంధ్ర పోటీలకు పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని, నియోజకవర్గస్థాయి పోటీలకు చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీఈటీ రామానుజబాబు, పీడీ ప్రభాకర్ తదితరులు పాల్గొని మాట్లాడారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

- పేదలకు దుస్తుల పంపిణీ



క్రిస్మస్ కేక్ కట్ చేస్తున్న సువార్తరాజ్, పాస్టర్లు

రాజుపాలెం (కొత్తపట్నం): కోస్టల్ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజుపాలెం గ్రామం కృపాకాలనీలో గల దేవుని సంఘం చర్చిలో సోమవారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వైజాగ్ నుంచి వచ్చిన సువార్తరాజ్ ముందుగా సెమీ క్రిస్మస్ కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సందేశమిస్తూ ఏసుక్రీస్తు జన్మదినం గురించి, దేవుని ప్రేమ గురించి వివరించారు. క్రీస్తు బోధనలు పాటిస్తే సమాజంలో సుఖసంతోషాలు ఉంటాయన్నారు. ప్రతిఒక్కరూ తోటివారి పట్ల పేమ, దయ, కృప చూపాలన్నారు. అనంతరం పాస్టర్లు సొంత నగదుతో పేద ఎస్టీలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో కోస్టల్ పాస్టర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పాస్టర్ పి.రాజేంద్ర, వైస్ ప్రెసిడెంట్ పాస్టర్ కె.పీటర్‌పాల్, సెక్రటరీ పాస్టర్ కె.కృపాదానం, ట్రెజరర్ పాస్టర్ కె.శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీ పి.శంకరయ్య, కమిటీ సభ్యులు జక్రయ్య, శేఖర్‌బాబు, దానియేలు తదితరులు పాల్గొన్నారు.

వడియరాజులను ఎస్టీల్లో చేర్చాలి



పాదయాత్రకు స్వాగతం పలుకుతున్న వడియరాజుల సంఘ నాయకులు

ఒంగోలు: వడియరాజులను ఎస్టీల్లో చేర్చాలనే నినాదంతో తిరుపతి నుంచి విజయవాడ కనకదుర్గమ్మ సన్నిధానం వరకు తురక అమర్నాథ్ నిర్వహిస్తున్న పాదయాత్ర సోమవారం ఒంగోలు చేరింది. వడియరాజుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తన్నీరు ఆంజనేయులు, జిల్లా అధ్యక్షుడు తన్నీరు వీరసాయి, తదితరులు వల్లూరమ్మ ఆలయం వద్ద పాదయాత్రకు ఘనంగా స్వాగతం పలికారు. ఒంగోలు నగరంలోని విజయనగరకాలనీ, ధారావారితోట, అద్దంకి బస్టాండు మీదుగా మంగమ్మ కాలేజీ వరకు పాదయాత్రలో పాల్గొన్నారు. వడియరాజులను ఎస్టీల్లో చేర్చాల్సిన ఆవశ్యకత గురించి వివరించారు. పాదయాత్ర విజయవంతం కావాలని కోరుతూ మహిళా నాయకురాలు కుంచాల కోటేశ్వరమ్మ రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు తన్నీరు నాగేశ్వరరావు, ఉద్యోగుల సంఘ నాయకుడు కుంచాల కోటయ్య, తన్నీరు రమణయ్య, బండారు అశోక్, తదితరులు పాల్గొని పాదయాత్ర నిర్వాహకులకు సంఘీభావం తెలిపారు.

వలంటీర్ కుటుంబానికి ఆర్థికసాయం



కొండారెడ్డి కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్న కార్పొరేటర్, వలంటీర్లు

ఒంగోలు టౌన్: నగరంలోని 44వ డివిజన్‌లో వలంటీర్‌గా ప్రజలకు సేవలందిస్తూ అందరివాడిగా ఆదరాభిమానాలు పొందిన గోదా చిన కొండారెడ్డి మరణం చాలా బాధాకరమని స్థానిక కార్పొరేటర్ గోపిరెడ్డి గోపాలరెడ్డి అన్నారు. సోమవారం సచివాలయ సిబ్బందితో కలిసి కొండారెడ్డి గృహానికి వెళ్లి అతని కుటుంబ సభ్యులను పరామర్శించారు. డివిజన్‌లోని సచివాలయ సిబ్బంది, కార్పొరేటర్లు సేకరించిన ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. వలంటీర్ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కొండారెడ్డి మరణించిన వెంటనే ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి అతని కుటుంబాన్ని పరామర్శించి రూ.లక్ష ఆర్థికసాయం అందించారని గోపాలరెడ్డి తెలిపారు.

బీసీ కుల కార్పొరేషన్లకు నిధులు విడుదల చేయాలి

ఒంగోలు సెంట్రల్: బీసీ కుల కార్పొరేషన్లకు నిధులు విడుదల చేసి విధులు కల్పించాలని, చట్టబద్ధతతో కూడిన బీసీ కమిషన్ ఏర్పాటు చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు తానికొండ సురేష్ యాదవ్ కోరారు. ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో ఒంగోలు కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జిల్లా స్పందనలో వినతిపత్రం అందించారు. బీజేపీ ఒంగోలు అసెంబ్లీ ఇన్‌చార్జి యోగయ్య యాదవ్, ప్రధాన కార్యదర్శి శివాజీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం



కషాయం తయారీ గురించి వివరిస్తున్న రాధ, సుభాషిణి

ఒంగోలు రూరల్: ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం మెరుగుపడుతుందని ఏపీ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వి.సుభాషిణి అన్నారు. మండలంలోని బొద్దులూరివారిపాలెం గ్రామంలో సోమవారం సాయంత్రం రైతు సాధికారిక సంస్థ ఏపీ ప్రకృతి వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ పంట పొలాలను ఆమె పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి రాధ శింగమనేని ఆధ్వర్యంలో 20 సెంట్ల విస్తీర్ణంలో సంవత్సరం పొడవునా వివిధ రకాలైన కూరగాయలు, ఆకుకూరలు, పండించే విధానాన్ని పరిశీలించారు. ప్రస్తుత కాలంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించే ఆకుకూరలు, కూరగాయలకు మంచి ధర ఉందని, సంవత్సరం పొడవునా ప్రకృతి వ్యవసాయ విధానంలో ఆకుకూరలు, కూరగాయలు పండించుకోవచ్చని డీపీఎం తెలిపారు. అవసరం ఉన్నంత వరకు ఉంచుకుని మిగిలిన కూరగాయలు, ఆకుకూరలను ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల ద్వారా అమ్ముకోవచ్చని అన్నారు. గ్రామంలో విస్తారంగా శనగ పంట పండించే రైతులతో సమావేశం నిర్వహించారు. రాధ శింగమనేని శనగ రైతులతో మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం వారు మార్కెట్‌లో ఉన్న ధర కంటే ఎక్కువ ధరకు పంట కొనుగోలు చేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా బొద్దులూరివారిపాలెం గ్రామంలో ఉన్న రైతు భరోసా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయ వనరుల కేంద్రాన్ని డీపీఎం సుభాషిణి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సదుపాయాన్ని రైతులందరూ వినియోగించుకోవాలని ఆమె కోరారు. కషాయం తయారీ గురించి వివరించారు. కార్యక్రమంలో ఐసీఆర్పీలు, రైతులు, డ్వాక్రా సంఘాల సభ్యులు, లీడర్లు, వీఓఏలు పాల్గొన్నారు.